క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిశుభ్రత తప్పనిసరి



కోడ్ నెంబర్ 123 అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఎన్ నాగరాజు

పెదవేగి : మండల పరిధిలోని ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో పరిశుభ్రత పాటించాలని తహసీల్దార్ ఎన్ నాగరాజు అన్నారు. బుధవారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం 123 ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించినట్లు చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రంలోని రికార్డుల నిర్వహణ, వంటగది, స్టోర్ రూమ్, పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్రం నిర్వహణ బాగుందని కార్యకర్త కృష్ణవేణిని అభినందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సహాయకురాలు భవాని, గర్భిణులు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామికి విశేష పూజలు



స్వామివారికి మల్లెపూలతో పూజలు చేస్తున్న దృశ్యం

పెదపాడు : అప్పనవీడులోని అభయాంజనేయ స్వామి ఆలయంలో స్వామివారికి బుధవారం మల్లెపూలతో పూజలు నిర్వహించారు. హనుమజ్జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ చైర్మన్ నెర్సు నాగభూషణం దంపతులు 1008 మల్లెలతో పూజలు చేశారు. అర్చకులు పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. రాత్రివేళల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలరించాయి. ఆలయ కమిటీ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



ఉంగుటూరు ఎంపీపీ గంటాశ్రీలక్ష్మి

ఉంగుటూరు: ఉంగుటూరు ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి ఎంపీపీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యారు. వైఎస్సార్ సీపీలో సీనియర్ నాయకురాలుగా ఉన్న శ్రీలక్ష్మి ఉంగుటూరు సర్పంచిగా పనిచేశారు. గోపీనాధపట్నం ఎంపీటీసీగా ఎన్నికై ఉంగుటూరు ఎంపీపీగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సూచనలు, సలహాలతో ప్రజా సమస్యలు పరిష్కారానికి, మండలం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తనను జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేసిన తోటి ఎంపీపీలకు కృతజ్ఞతలు తెలిపారు.

పామాయిల్‌లో కాండంకుళ్లుపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

దెందులూరు : ఇటీవల పామాయిల్ చెట్లకు కాండం మొదలు కుళ్లు విస్తృత స్థాయిలో పెరిగిందని, దీనిపై రైతులు అవగాహన పెంపొందించుకోవాలని పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎం.కొండారెడ్డి, సీనియర్ జనరల్ మేనేజర్ పరంకుశం మోహన్, ప్రధాన విస్తర్ణాధికారి డాక్టర్ ప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలో ఉద్యాన శాఖాధికారి ఎం.రత్న ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించి తెగుళ్ల, నివారణా పద్ధతులు వివరించారు. ఆకులు పసుపు, ఆరెంజ్ రంగులోకి మారతాయని, ముదురు ఆకులు ఎండిపోతాయన్నారు. క్రమేణా పువ్వ భాగంలో లేత ఆకులు పూర్తిగా ఎండిపోతాయని, ఈ తెగుళ్ల సోకిన చెట్లు పాలిపోయినట్లుగా ఉండి వీటి నుంచి ఎక్కువ సంఖ్యలో రెమ్మలు వస్తాయన్నారు. వదిలిన ఆకులు రాలటం, ఈనెల మధ్య అక్కడక్కడ విరిగిపోవడం, వీటితో పాటు మువ్వ పై భాగం ఆకులు విరిగి కిందికి వేలాడతాయన్నారు. పొలాన్ని శుభ్రంగా ఉంచి తోటలో ఎండిన దుంగలను తెగులు సోకిన చెట్లను వేళ్లతో సహా తీసివేసి చిన్న చిన్న ముక్కలుగా కాల్చివేయాలన్నారు. 5 గ్రాముల పాలకా పౌడర్‌తో ఉన్న ట్రైకోడెర్మాని 5 కిలోల వేపపిండితో కలిపి తెగులు సోకిన చెట్టు చుట్టూ ప్రతి ఏటా వేసి ఉధృతిని నివారించవచ్చని వివరించారు.

13 నుంచి క్రికెట్ టోర్నమెంట్

భీమడోలు : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 13 నుంచి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.10 వేల నగదు అందిస్తామని తెలిపారు. ఈ టోర్నమెంట్‌ను రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ ప్రారంభిస్తారన్నారు. ఆసక్తి గల వారు పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

'దిశ'తో మహిళలకు రక్షణ

- ఆపద సమయంలో ఎస్ఓఎస్ బటన్ నొక్కితే చాలు
- సత్వరమే పోలీసుల సాయం



యాప్‌లో కనిపించే ఎస్ఓఎస్ బటన్ నమూనా



దిశ యాప్ డౌన్‌లోడ్‌ను పర్యవేక్షిస్తున్న పెదవేగి ఎస్సై ఎం.లక్ష్మణ్

పెదవేగి : రాత్రి వేళ ప్రయాణంలో అనుమానాస్పద పరిస్థితులు, అత్తింటి వారి వేధింపులు.. వీధిలో వెళ్తుంటే ఈవ్‌టీజింగ్.. సమస్య ఏదైనా మహిళలకు అత్యవసర పరిస్థితుల్లో దిశ యాప్ ఉపయోగపడుతోంది. ఆపదలో ఉన్నవారు దిశ యాప్‌లో ఎస్ఓఎస్ బటన్ నొక్కితే క్షణాల్లో పోలీసులు సహాయం పొందొచ్చు. దిశ యాప్ మహిళల రక్షణకు కవచంలా నిలుస్తోండగా దీనిని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు పోలీసులు, సిబ్బంది వలంటీర్లు తమ ప్రాంతాల్లోని అపార్ట్‌మెంట్లు, షాపింగ్‌మాల్స్, విద్యా సంస్థలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, వాణిజ్య సముదాయాలు, సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద యాప్ పనితీరు, ఆపద సమయంలో ఎలా వినియోగించుకోవాలి తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తు న్నారు. మహిళలు, విద్యార్థులను చైతన్యవంతులను చేసి వారి సెల్‌ఫోన్లలో యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు.

పనిచేస్తుంది ఇలా...

దిశ యాప్‌లో ఐదురకాల ఆప్షన్లుంటాయి. మధ్యలో ఎస్ఓఎస్ అని ఉంటుంది. అత్యవసర సమయాల్లో ఎస్ఓఎస్ బటన్ నొక్కితే మీరు ప్రమాదంలో ఉన్నారని ఆ ఫోన్ లోకేషన్ వివరాలు దిశ కంట్రోల్ రూమ్‌కు వెళతాయి. ఎస్ఓఎస్ ప్రెస్ చేసే పరిస్థితి లేనిపక్షంలో ఫోన్‌ను గట్టిగా అటూ, ఇటూ ఊపితే చాలు ఆపదలో ఉన్నారన్న విషయం పోలీసులకు తెలిసిపోతుంది. ఈ యాప్‌లోనే డయల్ 100, డయల్ 112 నంబర్లను కూడా పొందుపరిచారు. సాయం కోసం వీటికి సైతం ఫోన్ చేయొచ్చు.



భీమడోలులో మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై చావా సురేష్‌కుమార్



ఉంగుటూరులో వాహన చోదకుల సెల్‌ఫోన్లలో దిశ యాప్ ఇన్‌స్టాల్ చేస్తున్న మహిళా పోలీసులు

దిశ యాప్‌పై స్పెషల్ డ్రైవ్

భీమడోలు : జిల్లా ఎస్పీ ఎం.మేరి ప్రశాంతి ఆదేశాల మేరకు మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఎస్సై చావా సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో దిశ యాప్‌పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. బస్టాండ్లు, కూడలి ప్రాంతాలు, జనం రద్దీగా ఉండే ప్రాంతాల్లోని మహిళలకు దిశ యాప్‌పై అవగాహన కల్పించి వారి సెల్‌ఫోన్లలో యాప్‌ను ఇన్‌స్టాల్ చేయించారు. మహిళల రక్షణకు దిశ యాప్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉంగుటూరు : ఉంగుటూరు టోల్ ప్లాజా వద్ద మహిళా పోలీసులు దిశ యాప్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వాహనచోదకులకు, మహిళలకు దిశ యాప్ ప్రయోజనాన్ని వివరించారు. వారి సెల్ ఫోన్లలో దిశ యాప్‌ను ఇన్‌స్టాల్ చేశారు. సుమారు 1200 మందికి ఈ యాప్ డౌన్‌లోడ్ చేశారు. ఎస్సై స్వామి పర్యవేక్షణలో ఈకార్యక్రమం నిర్వహించారు.

ప్రతి మహిళ చెంతకు యాప్

దిశ యాప్‌ను ప్రతి మహిళకు చేరువ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పెదవేగి మండలంలో ఇప్పటివరకు సుమారు 4 వేల మంది ఫోన్‌లో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. గృహిణులు, ఉద్యోగినులు, యువతులు యాప్ ద్వారా గృహహింస, అసభ్యదూషణలు, బ్లాక్ మెయిల్ తదితర ఆపదల నుంచి రక్షణ పొందుతున్నారు. – ఎం.లక్ష్మణ్, ఎస్సై పెదవేగి

రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు



ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు : టీడీపీవి అన్ని రాజకీయ లబ్ధి కోసం చేసే ఆరోపణలేనని, రికార్డు స్థాయిలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా ఆందోళన చెందిన రైతన్నలకు జగనన్న ప్రభుత్వం అండగా నిలబడిందన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 21 రోజుల గడువు ఉన్నా 5 రోజులకే ధాన్యం కొనుగోలు సొమ్ములు జమ చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 82.58 శాతం రైతులకు ప్రభుత్వం డబ్బులు విడుదల చేసిందన్నారు. ఏలూరు జిల్లా రైతులకు ఇప్పటి వరకు రూ.217 కోట్లు జమ చేసిన సంగతిని గుర్తు చేశారు. రాజకీయ లబ్ధి కోసం ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయన్నారు. పంట కొనుగోలు విషయంలో ఏ సమస్య ఉన్నా ప్రతి రైతు తమను సంప్రదించవచ్చని, ప్రత్యేకంగా అందుబాటులోకి తెచ్చిన టోల్‌ఫ్రీ నెంబర్ 155251కి ఫిర్యాదు చేయవచ్చని ఎమ్మెల్యే సూచించారు.

నేడు జోగన్నపాలేనికి ఎమ్మెల్యే రాక

దెందులూరు : జోగన్నపాలెం గ్రామానికి దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి గురువారం విచ్చేస్తారని సొసైటీ చైర్మన్ పాకలపాటి శ్రీనివాసరావు తెలిపారు. గ్రామంలో ఉదయం 6.30 గంటలకు ఆలయ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొంటారన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ లబ్ధి

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- కొప్పులవారిగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి : కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి మండలం కొప్పులవారిగూడెంలో బుధవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి వారి సమస్యలు తెలుసుకున్నారు. ముందుగా గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు పూలమాలలతో ఘనస్వాగతం పలికారు. గ్రామంలోని దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రూ 40 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని స్థానిక ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ పథకాలు మంజూరు కావాలంటే మండల కార్యాలయాలు, అధికారులు, నేతల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదని, అయితే ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. గ్రామవార్డు సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల ద్వారా జగనన్న మెరుగైన పాలన అందిస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో జగనన్నకు ప్రజలందరూ అండగా ఉండి మరోసారి ఆయనను సీఎంగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, ఎంపీపీ తాతా రమ్యకుమార్, పెదవేగి సొసైటీ చైర్మన్ పెనుమాక వెంకట సుబ్బారావు, మాజీ ఏఎంసీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, మండల సచివాలయాల కన్వీనర్ కేశన సతీష్, సర్పంచ్ చలపాటి మణి సంజీవరావు, బలుసు శ్రీధర్, తానంకి విష్ణు, ఎంపీటీసీ యర్రా సలోమి వెంకటరత్నం, చలపాటి నాగేశ్వరరావు, బలుసు కిషోర్, వీరంకి సుబ్బారావు, బలుసు రామదాసు, ఎం.చిన్ని, తహసీల్దార్ ఎస్ నాగరాజు, ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

ఉపసర్పంచ్ తోట పద్మారావుకు సత్కారం



తోట పద్మారావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు : గోపన్నపాలెం నూతన ఉపసర్పంచ్‌గా ఎన్నికైన వైఎస్సార్ సీపీ ఏలూరు పార్లమెంటరీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట పద్మారావును బుధవారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆయన కార్యాలయంలో సత్కరించి జ్ఞాపిక అందచేశారు. గ్రామ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. వ్యవసాయ సలహా మండలి దెందులూరు మండల చైర్మన్ కొండేటి గంగాధర బాబు, గోపన్నపాలెం గ్రామ సర్పంచ్ కోటే నాగ మల్లేశ్వరి కుమార్, ఎంపీటీసీలు ఏనుగు అంజలి ప్రసాద్, సువ్వా ప్రభుదాసు, నాయకులు వీరంకి సత్యనారాయణ, మాగంటి కృష్ణమోహన్, మోర్ల సుబ్బారావు, మోదుగు రామలింగేశ్వరరావు ఉన్నారు.

రైతు భరోసా కేంద్రం తనిఖీ



జోగన్నపాలెం రైతుభరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లను పరిశీలిస్తున్న ఆర్డీవో కిషోర్

దెందులూరు : దెందులూరు మండలం జోగన్నపాలెం రైతు భరోసా కేంద్రంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఏలూరు ఆర్‌డీఓ కే.పెంచల కిషోర్ తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా సచివాలయ సిబ్బంది ధాన్యం కొనుగోలుకు సంబంధించి నిర్వహిస్తున్న రిజిస్టర్లను పరిశీలించారు. ధాన్యం కొనుగోలుకు నమోదు చేసే ప్రతి అంశాలను ఎప్పటికప్పుడు నమోదు పూర్తి చేయాలని ఆర్‌బీకే సిబ్బందిని ఆదేశించారు. శాంపిల్స్, తేమ శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. రైతులతో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసిన రైతులకు నేరుగా వారి ఖాతాలకు సొమ్ము జమ అవుతుందని, అలాగే రవాణా ఖర్చులకు సంబంధించి సొమ్ము కూడా ఖాతాలకు జమవుతుందని ఆర్‌డీఓ రైతులకు వివరించారు. ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ తనిఖీలో వ్యవసాయ శాఖాధికారి గద్దె రమేష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సొసైటీ చైర్మన్ పాకలపాటి శ్రీనివాసరావు, సెక్రటరీ కొత్తపల్లి వెంకటేశ్వరరావు ఉన్నారు.

రీసర్వేతో భూ వివాదాలకు చెక్



పోలసానిపల్లి గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ షేక్ రహీమాబేగం హసేనా

భీమడోలు : జగనన్న శాశ్వత భూ హక్కు భూరక్ష పథకం ప్రజలందరికీ వరమని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పోలసానిపల్లి, సూరప్పగూడెం సర్పంచులు షేక్ రహీమాబేగం హసేనా, వెజ్జు బాలాజీ నాయుడు అన్నారు. జగనన్న శాశ్వత భూ హక్కు భూరక్ష పథకంపై భీమడోలు, పోలసానిపల్లి, సూరప్పగూడెం గ్రామ రైతులు, గ్రామస్తులకు బుధవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శాశ్వత భూ హక్కు భూరక్ష పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. రీసర్వేతో భూ వివాదాలకు చెక్ పడుతుందని, కావున కమతం కలిగిన వారంతా తమ ఆధార్ కార్డులు, డాక్యుమెంట్లను రెవెన్యూ, సర్వేయర్ సిబ్బందికి అందజేయాలన్నారు. భీమడోలులో రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సర్వే చేసి శాశ్వత భూ హక్కు పత్రాలను అందిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అంబటి దేవీ నాగేంద్ర ప్రసాద్, నియోజకవర్గ జగన్‌సేవాదళ్ కన్వీనర్ తుమ్మగుంట రంగ, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, తహసీల్దార్ షంషుద్దీన్, మండల సర్వేయర్ ధర్మారావు, ఆర్ఐ కిరణకుమారి, వార్డు సభ్యులు, వీఆర్వోలు కందులపాటి శంకర్, వి.వెంకటేశ్వరరావు, వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా విజ్ఞాన శిబిరాలు



పూళ్లలో ఆధ్యాత్మిక అంశాలపై శిక్షణ అందిస్తున్న గురువులు కురెళ్ల కిషోర్, ఈశ్వరీ



పోతునూరు గ్రంథాలయంలో విద్యార్థులకు కంప్యూటర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భీమడోలు: మండలంలోని భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ తరగతులు ఉత్సాహభరిత వాతావరణంలో మూడో రోజు బుధవారం కొనసాగాయి. చిన్నారులంతా నీతి కథలు చదివి వాటి సమీక్షలు రాశారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన 45 మంది విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిషుపై ఇంగ్లిషు ట్రైనర్ పోలిశెట్టి వీర వెంకట సత్యనారాయణ శిక్షణ అందించారు. పూళ్లలో గ్రంథపాలకుడు డీఎస్‌బీ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణలో యోగా గురువు కురెళ్ల కిషోర్, ఆధ్యాత్మిక గురువు గేదెల ఈశ్వరీ చిన్నారులకు పలు అంశాలపై శిక్షణను అందించారు. గుండుగొలనులో గ్రంథపాలకురాలు జి.నాగమణి ఆధ్వర్యంలో చిన్నారులు కథలు చదవి, వాటిని సమీక్షించారు.

దెందులూరు : వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థులకు వరమని దెందులూరు గ్రంథాలయ అధికారి రాజ్యలక్ష్మి, పోతునూరు గ్రంథాలయాధికారి జాన్‌బాబు అన్నారు. మండలంలో బుధవారం మూడవ రోజు గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు కంప్యూటర్‌పై అవగాహన కల్పించారు. నీతికథలు, పత్రికల గురించి వివరించారు. దెందులూరు ఉన్నత పాఠశాల గ్రంథపాలకులు ముళ్ళపూడి వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

గుండుగొలనులో బడి బాట



చిన్నారుల పేర్లు నమోదు చేసుకుంటున్న హెచ్ఎం పి.పాండురంగారావు, టీచర్లు

భీమడోలు: గుండుగొలను నెం.1 ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పి.పాండురంగారావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం బుధవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో టీచర్లు ఇంటింటికీ వెళ్లి బడిఈడు చిన్నారుల వివరాలను సేకరించారు. 5 ఏళ్ల నిండిన చిన్నారులను పాఠశాలల్లో చేర్పించుకున్నారు. ఒక్కరోజే 20 మందిని చేర్చుకుని అడ్మిషన్లు అందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం పాండురంగారావు మాట్లాడుతూ కార్పొరేట్‌కు దీటుగా తయారైన ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులను చేర్పించి వారి విద్యాభివృద్ధికి సహకరించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో టీచర్లు ఆనందబాబు, జాన్సన్, దత్తు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకానికి తూట్లు

భీమడోలు : బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం నిధుల కోత విధించి కూలీల కడుపు కొడుతోందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు అన్నారు. పోలసానిపల్లి చెరువు వద్ద పూడికతీత పనులు చేస్తున్న ప్రదేశానికి వెళ్లి ఆయన బుధవారం కూలీలను వారి సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ చట్టం రక్షణకు ఈనెల 12వ తేదీన ఏలూరు కలెక్టరేట్‌లో జరిగే ధర్నాకు కూలీలు పెద్ద ఎత్తున తరలి రావాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడుస్తోందన్నారు. షరతులు విధించి నిధుల కోత విధిస్తూ పేదల పొట్ట కొడుతుందని దుయ్యబట్టారు. చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



కుట్టుమెషీన్లు ప్రారంభిస్తున్న బైర్రాజు ఫౌండేషన్ సభ్యులు

గణపవరం: మహిళలు ఆర్థిక స్వావలంభన సాధిస్తే ఆ కుటుంబం అభివృద్ధి పథంలో నడుస్తుందని పలువురు పేర్కొన్నారు. బుధవారం గణపవరం మండలం పిప్పరలో బైర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు రెండు నెలల ఉచిత కుట్టుశిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ టీఎఫ్ నాయకుడు కాకర శ్యాంసన్ మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎన్నో పథకాలను అమలు చేస్తున్నారని, స్వచ్ఛంద సంస్థలు కూడా తమ వంతు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ వికాస సమితి సభ్యులు ఐవీఎన్‌రాజు, పంచాయతీ కార్యదర్శి జి.బాలకృష్ణ, ఫౌండేషన్ కోఆర్డినేటర్ తంగెళ్ల పద్మారావు, టైలరింగ్ శిక్షకురాలు రామిశెట్టి వరలక్ష్మి, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌తో విద్యార్థుల జీవితాలు తారుమారు



విక్రంరెడ్డిని సత్కరిస్తున్న దంత కళాశాల యాజమాన్యం, విద్యార్థులు

పెదవేగి : ర్యాగింగ్ చేయడంతో విద్యార్థుల జీవితాలు తారుమారు అవుతాయని డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మెంబర్, ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జీ.విక్రం రెడ్డి అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ దంత కళాశాలలో విద్యార్థులకు యాంటీ ర్యాంగింగ్‌పై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం ్ఐడాక్టర్ జి విక్రం రెడ్డి, ఏలూరు సర్కిల్ ఎస్ఈబీ సీఐ డి.ప్రసాద్ కుమార్ పాల్గొని మాట్లాడారు. ర్యాగింగ్ చేయడం వలన జీవితాన్ని పాగొట్టుకునే పరిస్థితి ఉత్పన్నమయ్యే ప్రమాదముందని అన్నారు. దీంతోపాటు తోటి విద్యార్థులకు వారి చదువులకు ఆటంకం కలిగే అవకాశం ఉందని, కావున ఎట్టి పరిస్థితుల్లో ఎవరూ ర్యాగింగ్ జోలికి పోవద్దని విద్యార్థులకు సూచించారు. అందరూ కలిసిమెలసి జీవించాలన్నారు. కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ ఫాదర్ జి.మోజెస్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ స్లీవరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వీడియం సి ట్రస్ట్ మెంబరు ఫాదర్ ఐ మైకేల్, నర్సింగ్ కళాశాల సెక్రెటరీ ఫాదర్ పి.జాకబ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

పెదవేగి : తన కుమార్తె కనపడడం లేదని ఓ తల్లి పోలీసులను ఆశ్రయించింది. పెదవేగి ఎస్సై ఎం లక్ష్మణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం రామశింగవరం గ్రామానికి చెందిన తాళ్ళూరి నిర్మలకు అదే గ్రామానికి చెందిన నాగేశ్వరరావు అనే వ్యక్తితో కొంతకాలం క్రితం వివాహమైంది. ఈ నేపథ్యంలో గత నెలరోజుల నుంచి నిర్మలకు అనారోగ్యకారణంగా తల్లి జొన్నకూటి మరియమ్మ ఇంటి వద్ద ఉంటోంది. అయితే ఈనెల 9న ఉదయం 9 గంటల నుంచి కనపడడం లేదని చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల దగ్గర వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పెదవేగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.